నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, సోమవారం 18 నవంబర్ 2024 | YADADRI BHUVANAGIRI

# ట్రాఫిక్ సీఐ సమయ స్ఫూర్తి..




నల్లగొండలో గ్రూప్ -3 పరీక్షకు ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను ఎగ్జామ్ సెంటర్‌కు తన వాహనంలో తరలించిన ట్రాఫిక్ సీఐ రాజు

నీలగిరి : పోలీసులు అంటే కఠినంగా ఉంటారంటారు. కానీ తమలో కూడా కరుణ దాగి ఉందని, మానవత్వం ఉందని నిరూపించారు నల్లగొండ ట్రాఫిక్ సీఐ దూది రాజు. అదివారం గ్రూప్ -3 పరీక్ష నిర్వహిస్తుండగా ఇద్దరు అభ్యర్థులు బస్సులో నల్లగొండకు ఆలస్యంగా వచ్చారు. పరీక్షకు కొన్ని నిమిషాల సమయం మాత్రమే ఉండడంతో ఇద్దరు అభ్యర్థులు బస్టాండ్ నుంచి బయటకు వచ్చి పరీక్ష కేంద్రాల గురించి వాకబు చేస్తున్నారు. అదే సమయంలో బస్టాండ్ దగ్గర విధుల్లో ఉన్న ట్రాఫిక్ సీఐ రాజు ఆ ఇద్దరిని తన వాహనంలో ఎక్కించుకొని పరీక్ష కేంద్రాలకు తరలించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

# సగం మందే హాజరు

- 6,043మందికి పేపర్-1కు 3,094, పేపర్-2కు 3,098 మంది హాజరు
- సోమవారం ముగియనున్న ఎగ్జామ్
- అభ్యర్థులతో కిక్కిరిసిన ఆర్టీసీ బస్టాండ్లు, బస్సులు

## తొలిరోజు సజావుగా గ్రూప్-3 పరీక్ష

**టీజీపీఎస్సీ గ్రూప్ -3 పరీక్షలు ఆదివారం జిల్లాలో సజావుగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన పరీక్షలకు అధికారులు సమగ్ర ఏర్పాట్లు చేపట్టారు. జిల్లాలో 15పరీక్షా కేంద్రాల్లో 6,043 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా అందులో సగం మంది మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకాలేదు. మొదటి రోజు జరిగిన పరీక్ష పేపర్-1కు సంబంధించి 6,043మంది అభ్యర్థులకు 3,098మంది(51:26 శాతం) హాజరుకాగా 2,945మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిర పేపర్-2కు 3,094మంది(51:19 శాతం) హాజరుకాగా 2,949మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షల నిర్వహణలో భాగంగా వివిధ స్థాయిల్లో 419మంది అధికారులు విధులు నిర్వహించగా పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగాయని వారు తెలిపారు.**

– భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 17



భువనగిరి పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది





అనంతారం వాత్సల్య కళాశాలలో పరీక్షల కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

### పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ హనుమంతరావు

మండలంలోని అనంతారం గ్రామ పరిధిలోని వాత్సల్య కళాశాలలో గ్రూప్-3 పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ హనుమంతరావు సందర్శించారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించి, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌ను ఏర్పాట్లు, మౌలిక వసతుల కల్పనలపై ఆరా తీశారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు.

### నేడు ముగియనున్న పరీక్ష

గ్రూప్ -3 పరీక్షల్లో భాగంగా ఆదివారం రెండు పేపర్లు ముగిశాయి. పేపర్ -3 సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30వరకు జరుగనుంది. దీంతో వీటికి సంబంధించి పరీక్షలు పూర్తిగా నేటితో ముగుస్తాయి.

### బస్టాండ్‌లో రద్దీగా జనం

వివిధ ప్రాంతాల నుంచి అభ్యర్థులు రావడంతో బస్టాండ్లు కిటకిటలాడాయి. వాహనాల్లో రావడంతో రోడ్లు రద్దీగా మారాయి. కొంత మంది అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ఆలస్యంగా రావడం, పరుగులు తీయడం కనిపించింది. కొన్ని సెంటర్ల వద్ద ఆలస్యంగా వచ్చిన పలువురు అభ్యర్థులను లోపలికి అనుమతించకపోడంతో కన్నీటిపర్యంతమవుతూ వెనుతిరికారు. కొంత మంది మహిళా అభ్యర్థులు చంటి పిల్లలతో పరీక్ష కేంద్రాలకు రావడంతో వారితో వచ్చిన వారు ఆడిస్తూ కనిపించారు.



భువనగిరిలోని ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కాలేజీ పరీక్షకేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్లు చెక్ చేసుకుంటున్న అభ్యర్థులు



భువనగిరిలోని ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కాలేజీ పరీక్షకేంద్రం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

# రాష్ట్రంలో అరాచక పాలన

## అక్రమాలు, దాడులకు పాల్పడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూరు(ఎం), నవంబర్17 : రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన సాగిస్తున్నదని, ప్రజలు, విపక్షాలపై దాడులు, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నది మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు. ఆత్మకూర్.ఎం మండల కేంద్రంలో ఆదివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలోని లగచర్లలో ప్రమాదకరమైన పరిశ్రమల ఏర్పాటు కోసం భూసేకరణను అడ్డుకున్న గిరిజనులతోపాటు ఇతర రైతులపై కాంగ్రెస్ నాయకులు, ప్రైవేట్ సైన్యం, పోలీసులు కలిసి దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. రజాకారులకు మించిన పాలనను కొనసాగిస్తూ, అక్రమాలు, అన్యాయాలకు ఎగబడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్‌పై అన్ని వర్గాల ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని చెప్పారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేని ప్రభుత్వం గద్దెదిగిపోవాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొరె భిక్షపతి, మహిళా విభాగం మండలాధ్యక్షురాలు సోలిపురం అరుణ, మండల నాయకులు కొరె బీరప్ప, నవనీత, ప్రమీల, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్‌లో ప్రజావాణి రద్దు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 17 : గ్రూప్-3 పరీక్ష, సమగ్ర కుటుంబ సర్వే నేపథ్యంలో కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ హనుమంతరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే, గ్రూప్-3 పరీక్ష సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు గమనించి కలెక్టరేట్ కార్యాలయానికి రావద్దని ఆయన తెలిపారు.



పంట కోసిన తర్వాత కాల్చిన వరి కొయ్యలు

# వరికొయ్యలు కాల్చితే కాలుష్య కాసారమే..

- పెరుగనున్న గాలి కాలుష్యం.. మరోవైపు తగ్గనున్న భూసారం
- పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు నాశనం
- పంట పొలంలోనే వరికొయ్యలు మురగ బెట్టాలంటున్న వ్యవసాయ అధికారులు
- యంత్రాలతో కోసిన వరికొయ్యలు పెద్దగా ఉండడమే కారణం

నల్లగొండ, నవంబర్ 17 : వరి కొయ్యలు కాల్చడంతోపాటు ఇటీవల పటాకులు కాల్పులు, ఫ్యాక్టరీల్లో వెలువడే రసాయనాల వ్యర్థాలు, వాహన కాలుష్యం.. ఫలితంగా దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం గాలి కాలుష్యం పెరిగింది. దీంతో అక్కడ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ పెరిగి గాలిలో నాణ్యత పడిపోయింది. దాంతో అనేక రకాల రోగాల బారిన పడుతున్నారు. ఇదే పరిస్థితి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నెలకొనే ప్రమాదం ఉన్నదా అంటే ఇప్పటికిప్పుడు కాకపోయినా వచ్చే రెండు మూడేండ్లలో తప్పదని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తున్నారు. జిల్లాలో గడిచిన రెండు మూడేండ్లుగా రైతులు వరి సాగు చేసిన అనంతరం ఆ వరి కొయ్యలను భూమిలోనే నిర్మూలించకుండా కాల్చడం మూలంగా గాలిలో కాలుష్యం పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. దీంతోపాటు ఇప్పటికే ఫార్మా కంపెనీలు, సిమెంట్ కంపెనీల వ్యర్థాలు జిల్లాను వణికిస్తున్న నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ రానున్న రోజుల్లో మరో ఢిల్లీలా మారే అవకాశం లేకపోలేదని హెచ్చరిస్తున్నారు. వరి కొయ్యలు భూమిలోనే నిర్మూలించకుండా కాల్చితే వచ్చే సాగుకు నష్టమే తప్ప లాభం లేదని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

**కోతలు ముగియడంతో..**

కాలానుగుణంగా వాహనాలు, ఫ్యాక్టరీలతోనే గాలి కాలుష్యం పెరుగుతుందనే ఆలోచన ఇప్పటి వరకు ప్రతి ఒక్కరిలో ఉన్నప్పటికీ ఇటీవల వ్యవసాయంలో వరి కొయ్యలు కాల్చడం వల్ల కూడా దీనికి తోడవుతుందని చెప్పవచ్చు. వరి కొయ్యలు కాల్చడం వల్ల వచ్చే సీజన్‌లో పంట పెరుగుదలకు అవసరమయ్యే పోషకాలు వాతావరణంలో కలిసిపోతాయని వ్యవసాయ అధికారులు అంటున్నారు. అదే విధంగా నేలలో సేంద్రియ కర్బన శాతంతోపాటు నేల సారం కూడా తగ్గిపోయే అవకాశం ఉంటుంది. ఈ వేడికి నేలలో ఉండే పంట ఉపయోగకర జీవులు కూడా చనిపోతాయి. నేలలో తేమ శాతం తగ్గి గట్టిపడి నేల కోతకు కూడా గురయ్యే అవకాశం ఉన్నది.

**భూమిలోనే మురగపెడితే అనేక లాభాలు**

వరి కొయ్యలు కాల్చకుండా భూమిలోనే మురుగ పెడితే పంటకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. గతంలో వరి కోసిన తర్వాత ఎలగడ దున్ని నీళ్లు పెట్టాక ఆ వరి కొయ్యలు చనిపోగానే ఆ భూమిని మరోసారి దున్నితే వరికొయ్యలు మొత్తం చనిపోయేవి. దాంతో ఆ పొలంలో పోషకాలతోపాటు కర్బన శాతం పెరుగుతుంది. అంతేకాక ఆ వరి కొయ్యలు కుళ్లిపోయేందుకు ఎకరంలో 150కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్ లేదా వేస్ట్ డీ కంపోజర్ చల్లడంతో మురిగి నేల సారవంతం అవుతుంది.

**ఇప్పటికే జిల్లాను ఆవరించిన పలు రకాల కాలుష్య ప్రభావాలు**

జిల్లాలో ఇప్పటికే పలు రకాలుగా కాలుష్య ప్రభావం ఆవహించి ఉన్నప్పటికీ తాజాగా రైతులు అవగాహన లేమితో వరి కొయ్యలు కాల్చడం వల్ల కొత్త ప్రమాదం తెచ్చిన వారవుతారని వాతావరణ వేత్తలు అంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక రకాలైన ఫార్మా కంపెనీలతో పాటు సిమెంట్ కంపెనీల వల్ల వాయు, నీటి కాలుష్యం అవుతున్నది. ప్రధానంగా ఫార్మా ప్రభావం యాదాద్రి జిల్లాలో ఉండగా సిమెంట్ కంపెనీల ప్రభావం సూర్యాపేట, నల్లగొండ జిల్లాలో ఉన్నది. ఇదిలా ఉండగా ఈ సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో 12.50లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా మొత్తం యంత్రాలతోనే కోసిన తర్వాత వాటి వరి కొయ్యలు పెద్దగా ఉండటంతో మొత్తం కాల్చివేస్తున్నారు. దాంతో వాయు కాలుష్యం పెరుగుతుండడంతో ప్రమాదం పొంచి ఉన్నట్లు అర్థమైతుంది.

### వరి కొయ్యలు కాల్చితే పంట నష్టంతోపాటు వాయు కాలుష్యం



వరికొయ్యలు కాల్చడం కంటే వాటిని భూమిలోనే మురగబెడితే ఎంతో ప్రయోజనం ఉంటుంది. భూమిలో మురుగ పెట్టటానికి ఎకరానికి 1.50 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్ వాడితే సరిపోతుంది. అంతేకాకుండా వేస్ట్ డీ కంపోజర్ ద్వారా కూడా మురిగిపోతుంది. అలా కాకుండా అవగాహన లేమితో కాల్చితే వచ్చే సీజన్‌లో పోషకాల లోపం ఏర్పడి పంట దిగుబడి తగ్గడంతోపాటు భావితరానికి నష్టం చేకూర్చిన వారవుతారు. దీనికి తోడు వాయు కాలుష్యం పెరిగి అనేక రోగాలు వచ్చే అవకాశం ఉంది.

**–పాల్వాయి శ్రవణ్ కుమార్, డీఏఓ, నల్లగొండ**

# నోటీసులతోనే సరి.. చర్యలేవి?

- ఉచిత చేప పిల్లల విడుదలలో లోపించిన క్వాలిటీ, క్వాంటిటీ
- స్వయంగా గుర్తించిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు
- అక్రమాలపై వరుస కథనాలు రాసిన నమస్తే తెలంగాణ
- నోటీసులిచ్చి మమ అనిపిస్తున్న మత్స్యశాఖ యంత్రాంగం

నల్లగొండ, నవంబర్ 17 : ప్రభుత్వం మత్స్యకారులకు అందించే ఉచిత చేప పిల్లల విడుదలలో పారదర్శకత లేదు. క్వాలిటీ లేదు, క్వాంటిటీలో చిత్త శుద్ధి లేదు. చేప పిల్లల్లో దెయ్యం చేప పిల్లల విడుదల..ఇదీ నల్లగొండ జిల్లాలోని మత్స్యశాఖ యంత్రాంగం తీరు. అక్రమాలను అధికార పార్టీ ఎమ్మెల్యేలు గుర్తించినా పట్టడం లేదు. వరుసగా నమస్తే తెలంగాణలో వార్తా కథనాలు ప్రచురితమైనా చర్యలు లేవు. నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు అధికారులు. ఈ నెల 4న నల్లగొండ పట్టణంలోని చర్లపల్లి తోపాటు మండల పరిధిలోని నర్సింగ్‌బట్లలో పోసిన చేప పిల్లల్లో వచ్చిన దెయ్యం చేప పిల్లలపై . 5న చేప పిల్లల క్వాంటిటీ, క్వాలిటీలో నాణ్యత లోపంపై నమస్తే తెలంగాణ వెలుగులోకి తెచ్చింది. ఈ నెల 11న నకిరేకల్‌లో స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం గుర్తించి 67,500 చేపిపిల్లలకు గానూ 54వేలు మాత్రమే పోశారని నిలదీశారు. ఈ నెల 14న అడవి దేవులపల్లిలో స్థానిక శాసన సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి చిన్న పిల్లలు పోస్తున్నారని రిజెక్ట్ చేశారు. ఇవన్నింటికీ అధికారుల వద్ద ఒక్కటే సమాధానం చేపి పిల్లలు పోసే కాంట్రాక్టర్‌కు నోటీసులిచ్చామని. నోటీసులకు వారి వివరణ ఏమిటి? తర్వాత కూడా ఎందుకు పరిస్థితి చక్కబడటం లేదని వారు దృష్టి సారించడం లేదు. ఒకటి నాలుగు సార్లు నోటీసులివ్వడం తప్ప చర్యలు లేవా అనేది వారికే తెలియాలి. కాంట్రాక్టర్లు ఎంతైనా అధికార పార్టీ నేతలు కదా.. నోటీసులు తప్ప ఇంకా ఏం చేస్తాములెండి అనే మాటలు అదే శాఖలో వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే వీరేశం తక్కువ వచ్చాయని చెప్పిన 13వేల చేప పిల్లలు పోయనేలేదని, బత్తుల వెనక్కి పంపిన అదే పిల్లలు కాసేపు అయ్యాక పోశారే తప్ప పెద్ద పిల్లలు పోయలేదనే ఆరోపణలు ఆయా సంఘాల వారు చెప్పడం గమనార్హం.

## నేడు నల్లగొండకు బీసీ కమిషన్ రాక

నల్లగొండ, నవంబర్ 17 : నల్లగొండ జిల్లా కేంద్రానికి సోమవారం బీసీ కమిషన్ రానున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కమిషన్ చైర్మన్ నిరంజన్‌తోపాటు సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. బీసీ కులాల వారు ఆర్థిక, ఇతర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పలు వినతులు చేయవచ్చని తెలిపారు. బీసీ సామాజిక, ఆర్థిక స్థితిగతులను పరిశోధించి ఆర్థిక ప్రయోజనాలను పెంపొందించడం, వారి వృత్తుల్లో కలిగే ఇబ్బందులను అధ్యయనం చేయడానికి ఈ కమిషన్ వస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. బీసీ కుల సంఘాల వారు వారి వద్ద ఉన్న సమాచారం అందజేసి వారి వాదనలు వివరిస్తూ ఆరు సెట్లు ఇంగ్లిష్, ఆరు సెట్లు తెలుగులో అఫిడవిట్‌తో వ్యక్తిగతంగా లేదా అసోసియేషన్ల ద్వారా వినతులు చేయాలని సూచించారు.

# గుప్పుమంటున్న గుడుంబా

## జిల్లాలో మళ్లీ సారా తయారీ

- గ్రామాల్లో కుటీర పరిశ్రమగా రూపాంతరం
- యథేచ్ఛగా నిషేధిత బెల్లం, పటిక అక్రమ రవాణా
- బీఆర్ఎస్ హయాంలో తయారీదారులకు ఉపాధి అవకాశాలతో నిర్మూలన
- నేడు పట్టించుకోని ప్రభుత్వం, అధికార యంత్రాంగం
- పది నెలల్లోనే 1,032 కేసులు నమోదు
- నిఘా పెంచకపోతే ప్రమాదంతప్పదు

**జిల్లాలో నాటు సారా తయారీ రోజురోజుకూ పెరుగుతున్నది. గ్రామాల్లో మళ్లీ కుటీరపరిశ్రమగా పుంజుకుంటున్నది. సారా తయారీ చేసేందుకు వినియోగించే నిషేధిత నల్లబెల్లం, పటిక అక్రమ రవాణా విచ్చలవిడిగా దొరుకుతున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సారా తయారీ, విక్రయాల వృత్తిలో ఉన్న వారికి లక్షలాది రూపాయలు వెచ్చించి జీవనోపాధి కల్పించడంతో గుడుంబా ఆనవాళ్లు లేకుండా పోయాయి. దాంతో ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో మళ్లీ నాటుసారా గుప్పుమంటున్నది. సూర్యాపేట జిల్లాలో పది నెలల్లోనే నాటు సారాకు సంబంధించి ఎక్సైజ్, పోలీసు శాఖలు 1,032 కేసులు చేశాయి. అధికారులకు దొరక్కుండా సాగుతున్న దందా ఇంకా ఏ స్థాయిలో ఉందో దీన్నిబట్టి తెలుస్తున్నది.**

– సూర్యాపేట, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ)



హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలో నాటుసారా బట్టీని గుర్తించి దాడి చేసిన ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది(ఫైల్)

నాటు సారాతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రాణాలు పోతున్నాయని బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సారా తయారీ, విక్రయాలను ఎక్కడికక్కడ కట్టడి చేసింది. గత ఉమ్మడి రాష్ట్రంలో నాటి రాజకీయ నేతల కనుసన్నల్లోనే గ్రామాల్లో సారా తయారీ కుటీర పరిశ్రమగా మారి చాలా మంది కోట్లకు పడిగెత్తిన వారు ఉన్నారు. ఈ నాటు సారా తాగడం వల్ల రాష్ట్రంలో ప్రతి నిత్యం పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోవడం, అనేక మంది బక్కచికి పనులు చేయలేని దుస్థితికి రావడంతో వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. దీనిని గుర్తించిన నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం నాటు సారాను పూర్తిగా అరికట్టేందుకు చర్యలు తీసుకుంది. సారా తయారీపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కుటుంబాలకు లక్షలాది రూపాయలు ఇచ్చి జీవనోపాధిని కల్పించింది. దాంతో జిల్లాల్లో దాదాపు 100శాతం నాటుసారాను అరికట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన గతేడాది కాలంగా మళ్లీ నాటు సారా తయారీ పుంజుకుంటున్నది. ఇష్టారాజ్యంగా నల్లబెల్లం, పటిక అక్రమ రవాణా అవుతున్నది.

### పది నెలల్లోనే 1,032 కేసులు

గత పది నెలల్లోనే నాటు సారాకు సంబంధించి సూర్యాపేట జిల్లాలో 1,032 కేసులు నమోదయ్యాయంటే అధికారులకు దొరుకకుండా జరుగుతున్న దందా ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. పది నెలల్లోనే ఎక్సైజ్, పోలీసు శాఖలు జిల్లా వ్యాప్తంగా 4,258 లీటర్ల నాటు సారా, 1,66,292 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. 15,438 క్వింటాళ్ల నల్లబెల్లం, 3540 కిలోల పటిక పట్టుకొని167 వాహనాలు సీజ్ చేశారు. మొత్తం 887మందికిపైనే కేసులు నమోదు చేయగా మరో 897 మందిని బైండోవర్ చేశారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులతోపాటు పోలీసులు బెల్లం అక్రమ రవాణాతోపాటు గ్రామాల్లో నాటుసారా తయారీపై మరింత నిఘా పెంచాల్సి ఉంది. లేని పక్షంలో సారా మళ్లీ కుటీర పరిశ్రమగా మారి ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పడడం ఖాయమనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.